క్లుప్తంగా

మున్సిపాలిటీలో కంట్రోల్ రూం ఏర్పాటు

హుజూర్‌నగర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపానుతో ప్రజలకు కలిగే ఇబ్బందుల దృష్ట్యా హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షంతో ప్రజలకు ఏమైనా ఇబ్బందులు కలిగితే మున్సిపల్ అధికారులు అశోక్ 9032736373, వెంకటేశ్వర్లు 9110529891, చంద్రశేఖర్‌రెడ్డి 9704286700, సీతారాములు, 9908430376, శ్రీనివాస్ 7981818882లను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

ఆలయానికి మకరతోరణం బహూకరణ



ఆంజనేయస్వామి విగ్రహానికి అలంకరించిన మకరతోరణం

మునగాల : మండలంలోని రేపాలలో గల శ్రీఆంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన మాచెర్ల రమేష్ –కళ్యాణి దంపతులు రూ.34వేలతో చేయించిన మకరతోరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వారు ఆలయం ఆవరణలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకొని ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్వామి వారికి మకరతోరణం బహూకరించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం దేవాలయం చైర్మన్ శౌంటి పరుశరామయ్య దాతలను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయానికి ఎటువంటి ఆదాయవనరులు లేవని, కేవలం భక్తుల సహకారంతో కొనసాగుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

మోతె : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో మండల రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వరి, పత్తి పంటలు తుపానుతో భారీగా దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. రైతుల పంటల రక్షణకు ఉచితంగా టార్పాలిన్ పట్టాలు ప్రభుత్వం అందజేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి పీఠం కోసం ఢిల్లీ నుంచి గల్లీదాకా పరుగులు తీస్తున్నారని అన్నారు. తుపానుతో పంటలు నష్టపోయిన రైతులకు రూ.50వేల నష్టపరిహారం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

నూతన పంచాయతీల్లోనూ కాంగ్రెస్‌కే ఆధిక్యం

చిలుకూరు : తెలంగాణ ప్రభుత్వం 500జనాభా గల గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఈ గ్రామపంచాయతీల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఆశించిన ఫలితాలు వస్తాయని ఆ పార్టీ నాయకులు అంచనాలు వేసుకున్నారు. కాని మండలంలోని నూతన గ్రామపంచాయతీల్లో ఎక్కడా కూడా ఆధిక్యం రాలేదు. మండలంలోని జానకీనగర్ గ్రామపంచాయతీ నుంచి దూదియాతండా గ్రామాన్ని, జెర్రిపోతులగూడెం గ్రామపంచాయతీ నుంచి కొమ్ముబండతండాను, కొండాపురం గ్రామం నుంచి మాధవగూడెం, ఆర్లెగూడెం పంచాయతీ నుంచి రామ్‌చంద్రానగర్ గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ లీడ్ వచ్చింది. దూదియాతండాలో 315, రామ్‌చంద్రానగర్‌లో 99, మాధవగూడెంలో 4ఓట్లు బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్‌కు అధికంగా వచ్చాయి. కొమ్ముబండతండాకు సంబంధించిన ఓట్లు జెర్రిపోతులగూడెంలో ఉన్నాయి, అక్కడ కూడా కాంగ్రెస్ పార్టీకే లీడ్ వచ్చింది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులకు నిరాశే మిగిలింది.

పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సూర్యాపేట రూరల్ : పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని రూరల్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించేలా చూడాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ సాయిరాం, ఏఎస్‌ఐ వెంకన్న, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10నుంచి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలోని శ్రీభవానీ సమేత జంగమేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఈనెల 10నుంచి 2రోజుల పాటు జరగనున్నాయి. 10న ఆదివారం అఖండ దీపారాధన, విగ్రహాల ఊరేగింపు, 11న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, చండీ రుద్రయాగం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయకమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు.

అసంపూర్తిగా సర్వీసు రోడ్లు

- 'జీఎమ్మార్' నిర్లక్ష్యంతో పెండింగ్‌లోనే పనులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు



మునగాలలో సర్వీసు రోడ్డు నిర్మించాల్సిన ప్రదేశం



మునగాలలో మధ్యలో వదిలేసిన రోడ్డు పనులు

మునగాల : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిని జీఎమ్మార్ సంస్థ నాలుగులేన్లుగా విస్తరించింది. ఈ విస్తరణలో భాగంగా పలు గ్రామాల్లో సర్వీసు రోడ్ల నిర్మాణాన్ని కూడా చేపట్టింది. అయితే మండల కేంద్రంతో పాటు మండలంలోని రహదారి వెంట ఉన్న పలు గ్రామాల్లో సర్వీసు రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయకపోవడంతో నిత్యం వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. మునగాలలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయడంతో రహదారికి ఇరువైపులా దాదాపు రెండు కిమీ పొడవున సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే సర్వీసురోడ్ల నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి చేయలేదు. స్థానిక మజీద్ వద్ద సుమారు 200మీటర్ల మేర సర్వీసు రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. దీంతో మండలంలోని నారాయణగూడెం, కృష్ణానగర్ గ్రామాల ప్రజలతో పాటు ఈ ప్రాంతం ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ ప్రాంతంలో ముస్లింల ఖబ్రస్తాన్ ఉండడంతో వారు అక్కడ అనుమతికి సుముఖంగా లేకపోవడంతో రోడ్డు నిర్మాణపు పనులు నిలిచిపోయాయి. దీంతో జీఎమ్మార్ సంస్థ దీనిని సాకుగా తీసుకోని పనులు చేపట్టకుండా వదిలేసింది. స్థానికులు పలుమార్లు ఈ ప్రాంతంలో సర్వీసు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వరకు పలుమార్లు లిఖితపూర్వకంగా వినతిపత్రాలు అందించినా ఫలితం కన్పించలేదు.

వక్ఫ్‌బోర్డు అనుమతి ఇచ్చినా..

మండల ప్రజల ఆందోళన ఫలితంగా దిగివచ్చిన అధికారులు ఎట్టకేలకు సర్వీసు రోడ్డు నిర్మాణానికి వక్ఫ్‌బోర్డు నుంచి అనుమతి పొందారు. స్పందించిన వక్ఫ్‌బోర్డు సభ్యులు ఖబ్రస్తాన్‌కు ఇబ్బంది కలుగకుండా బ్రిడ్జి నిర్మాణంతో సర్వీసు రోడ్డు నిర్మించుకోవచ్చని అనుమతి ఇచ్చింది. వక్ఫ్‌బోర్డు అనుమతి ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికి సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని జీఎమ్మార్ సంస్థ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వీసు రోడ్లు లేక ఆయా గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపైకి వచ్చి తమ ప్రాణాలను కోల్పోతున్నారు.

ముకుందాపురంలో మరీ దారుణం..

మండంలోని ముకుందాపురంలో సర్వీసు రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో గ్రామప్రజలు జాతీయ రహదారిపైకి రావల్సి వస్తుంది. ఫలితంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. సర్వీసురోడ్ల నిర్మాణంతో పాటు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నాలుగేళ్ల క్రితం గ్రామస్తులు పార్టీలకతీతంగా 10రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సర్వీసు రోడ్ల నిర్మాణం చేపట్టి తమ ప్రాణాలు కాపాడాలని రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు అధికారులను, జీఎమ్మార్ సంస్థను కోరుతున్నారు.

సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాలి



“ మండల కేంద్రంలో మజీద్‌కు సంబంధించిన ఖబ్రస్తాన్ వద్ద గతంలో అసంపూర్తిగా నిలిపివేసిన సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలి. ఇప్పటికే పలుమార్లు అధికారులకు, జీఎమ్మార్ సంస్థ దృష్టికి తీసుకువెళ్లాం. సదరు సంస్థ స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతాం.

– ఉప్పల జానకిరెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు

ప్రజల ప్రాణాలను కాపాడాలి



“ మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్లను సత్వరమే పూర్తిచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలి. జీఎమ్మార్ సంస్థ నిర్లక్ష్యంతో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. భవిష్యత్‌లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి.

– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, మునగాల

ప్రజాప్రతినిధులు స్పందించాలి



“ మండల పరిధిలోని మాధవరం, మునగాలతో పాటు, ముకుందాపురం గ్రామాల్లో జాతీయ రహదా రికి ఇరుపైపులా అసంపూర్తిగా నిలిచిపోయిన సర్వీసురోడ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించాలి. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి జీఎమ్మార్ సంస్థపై వత్తిడి తీసుకువచ్చి వెంటనే రోడ్ల నిర్మాణాలు చేపట్టేలా చూడాలి.

– వందిరి నాగిరెడ్డి, విద్యావేత్త, ముకుందాపురం

గెలుపు, ఓటములపై పార్టీల సమీక్ష

- నియోజకవర్గంలో మెజార్టీపై లెక్కలేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు
- పరాజయంపై బీఆర్‌ఎస్ పార్టీలో అంతర్మథనం

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు, ఓటములపై హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఆయా పార్టీల నాయకులు లోతైన సమీక్షలు నిర్వహిస్తున్నారు. విజయం సాధించిన వారు ఏఏ గ్రామాల్లో ఎంతెంత మెజార్టీ వచ్చిందని లెక్కలేస్తున్నారు. ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీలో చేరికలు కూడా వారికి కలిసి వచ్చే అంశమని భావిస్తున్నారు. ముఖ్యంగా హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మాజీ చైర్మన్, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులే కాకుండా మిగతా ఆయా మండలాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గంలో ఉత్తమ్‌కు ఉన్న చరిష్మా, దీనికి తోడు సీపీఐ, టీడీపీ నాయకుల మద్దతు, కాంగ్రెస్ ప్రచారం చేసిన వివిధ పథకాలు, సహజంగానే పదేళ్లుగా ఉన్న ప్రభుత్వం మీద వ్యతిరేకత కాంగ్రెస్ గెలుపు మరింత సునాయాసం అయిందని భావిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి అన్ని మండలాల్లో స్పష్టమైన ఆధిక్యం వచ్చిందని విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా ఓటమి పాలైన అధికార బీఆర్‌ఎస్ పార్టీ వారు మాత్రం ఇంతగా ప్రజాగ్రహానికి గురకావడానికి, ఓడి పోవడానికి గల కారణాలను ఒక్కొక్కటిగా విశ్లేషించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల బయటకు వెళ్లి పోవడం, మండలాల్లో స్థానిక నాయకులు భిన్నవైఖరి ప్రదర్శించడం ఆ పార్టీకి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

అన్ని మండలాల్లో కాంగ్రెస్ ఆధిక్యం..

నియోజకవర్గంలోని 2మున్సిపాలిటీలతో పాటు 7మండలాల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ రావడంతో తన పట్టునిలుపుకుంది. ఇదే ఒరవడిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కొనసాగించాలని మరింత లోతుగా విశ్లేషించుకుంటున్నట్లు తెలుస్తోంది.

మండలాల వారీగా రెండు పార్టీలకు వచ్చిన ఓట్లు

మండలం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	మెజారిటీ
నేరేడుచర్ల మండలం	9,516	6,591	2,925
నేరేడుచర్ల పట్టణం	5,891	2,744	3,147
పాలకవీడు	10,909	5,635	5,274
మఠంపల్లి	17,598	11,460	6,138
మేళ్లచెరువు	14,864	9,772	5,092
చింతలపాలెం	12,280	8,509	3,771
హుజూర్‌నగర్	10,060	6,256	3,804
హుజూర్‌నగర్ పట్టణం	13,655	6,578	7,077
గరిడేపల్లి	20,547	13,816	6,731
పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు	1,387	458	926
మొత్తం	1,16,707	71,819	44,888

కాంగ్రెస్‌కు పాలకవీడులోనే ఆధిక్యం

పాలకవీడు : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పాలకవీడు మండలం కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలోనే అధిక మెజార్టీ అందించిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌వి.సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మిగితా ఆరు మండలాల్లో పోలైన ఓటింగ్ శాతంతో పోల్చితే పాలకవీడు మండలంలో మొత్తం 20,745 ఓటర్లు ఉండగా 18,457 పోలయ్యాయని, ఇందులో కాంగ్రెస్‌కు 10,909 ఓట్లు, బీఆర్‌ఎస్ 5,635 ఓట్లు వచ్చినట్లు, 5,274 ఓట్ల మెజార్టీ కాంగ్రెస్‌కు లభించినట్లు తెలిపారు. మండలంలో ఉత్తమ్ విజయానికి కృషి చేసిన ప్రతీ నాయకుడు, కార్యకర్తకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. ఆయన వెంట ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ బుజ్జిమోతీలాల్, ఎంపీటీసీ ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాసిం, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, శేషురెడ్డి, సందీప్, సుబ్బుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చత్రునాయక్



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

పాలకవీడు : విద్యార్థులకు నాణ్యమైన మెరుగైన విద్య బోధించాలని, అందుకు ప్రతీ ఉపాధ్యాయుడు తమ బోధనలో నైపుణ్యం పెంచుకోవాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని జాన్‌పహాడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు సరళమైన భాషలో విద్యనందించాలన్నారు. విద్యా విధానాలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ మండల నోడల్ అధికారి వంగాల రాంరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం ఉపేందర్, ఆర్‌పీలు ఎస్‌కె యూసుఫ్, ధర్మరాజు, ఉపాధ్యాయులు కనకతార, విజిత, రేష్మా బేగం, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, సంబయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన అభివృద్ధికి తోడ్పడాలి

నేరేడుచర్ల : ఉపాధ్యాయులు విద్యార్థులు అభ్యసన అభివృద్ధికి తోడ్పడాలని మండల విద్యాధికారి చత్రునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎస్ అమలుపై తీరుపై జరిగిన సమీక్షా సమావేశంలో దీపికలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠ్యప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, అభ్యాసన దిపకలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు బట్టు మధు, మండల నోడల్ అధికారి సత్యనారాయణరెడ్డి, పెంచికల్‌దిన్న కాంప్లెక్స్ హెచ్ఎం ఎల్.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు శ్రీధర్, షఫీ, పీఆర్‌పీలు శ్రీనివాస్‌రెడ్డి, పద్మ తదితరులున్నారు.

మిచాంగ్ తుపానుతో రోజంతా ముసురు



మునగాలలో జలమయమైన గణపవరం క్రాస్‌రోడ్డు



నేరేడుచర్లలో కురుస్తున్న వర్షం



చిలుకూరులో వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

నేరేడుచర్ల : మిచాంగ్ తుపానుతో మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రోజంతా ఎడతెరపిలేని వర్షం కురుస్తుంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు చలికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నడిగూడెం : రాష్ట్రంలో కురుస్తున్న మిచాంగ్ తుపానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ సాంఘీక శాఖ స్థాయి సంఘాల చైర్మన్ బాణాల కవిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చలితో కూడిన భారీ ఈదురుగాలులు వీస్తున్నాయని, వర్షాలు భారీగా కురిసే అ వకాశముందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మునగాలలో ఎడతెరపిలేని ముసురు

మునగాల : మిచాంగ్ తుపాను ప్రభావంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రోజంతా ఎడతెరపిలేని ముసురు వర్షం కురిసింది. దీంతో ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. ముసురు ఆగకుండా కరుస్తుండడంతో గ్రామాల్లోని వీధులు జలమయమయ్యాయి.

రోజంతా కురిసిన వర్షం

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మిచాంగ్ తుపాను ప్రభావంతో మంగళవారం రోజంతా భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చలి గాలులు వీస్తుండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

చిలుకూరు : మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మంగళవారం మండల వ్యాప్తంగా ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. దీంతో వీధుల్లో, రోడ్డులపై నీరు నిలిచింది. వర్షానికి, చలిగాలులకు గ్రామాల్లోని ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు.

హుజూర్‌నగర్‌లో ..

హుజూర్‌నగర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో మంగళవారం హుజూర్‌నగర్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తుండంతో పట్టణ ప్రజలు చలికి వణికి పోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి రైతులు, రైతు కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులకు వెళ్లేవారు తప్ప ఇతరులు ఇళ్లకు నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది.

మండలంలో కురుస్తున్న వర్షం

గరిడేపల్లి : మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం వర్షం కురిసింది. తుపాను ప్రభావంతో వేసవి పంట వేసుకునే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో క్షేత్రపాలకుడికి ఆకుపూజ



బూరుగడ్డ దేవాలయంలో ఆంజనేయస్వామి ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో కార్తీకమాసంలో భాగంగా మంగళవారం శ్రీఆంజనేయ స్వామికి ఆకుపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, గంధ సిందూరం, పానకం, వడపప్పు, పండ్లు, పులిహోర, వడమాల, ఆకుపూజ, మంగళశాసనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, గోవిందరెడ్డి, కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నరంశెట్టి నర్సయ్య మృతికి సంతాపం

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నరంశెట్టి నర్సయ్య(53) మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సంతాపం ప్రకటించారు. నర్సయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



కోదాడరూరల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాలధారులు, దాత



మునగాల : అన్నదాన కార్యక్రమానికి హాజరైన మాలధారులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మంగళవారం మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దాత రామినేని నాగరాజు–నాగజ్యోతి దంపతులు ఏర్పాటు చేశారు. అన్నదానం 450మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, బర్మావత్ సీతరాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, నాగరాజు, మాలధారులు ఉన్నారు.

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 110మంది మాలధారులు పాల్గొన్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి మండల కేంద్రానికి చెందిన కొమ్ము ఈదారావు –లక్ష్మి దంపతులు 50కేజీల బియ్యం ఇచ్చి సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు వల్లోజు వెంకన్న, తంగెళ్ల సాంబ, బొబ్బిలి సంజీవరెడ్డి, కొమ్ము ఈదారావు, రచ్చా శ్రీనివాస్, గాయం శ్రీనివాసరెడ్డి, అక్కినేపల్లి శ్రీనివాస్, జిల్లా రాంబాబు, వీరస్వామి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అనఘాష్టమి వ్రతం



వ్రతంలో పాల్గొన్న మహిళలు

భానుపురి : కార్తీక మాసం బహుళ అష్టమిని పురస్కరించకుని జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో గల శ్రీసాయి బాబా మందిరంలో మంగళవారం అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. మందిర అర్చకులు వలివేటి విశ్వేశ్వరశర్మ, గంగాధర శర్మలు వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దత్తాత్రేయుడు సర్వమానవాళికి గురువు అని, గురువు అనుగ్రహంతోనే ఉన్నత విద్యతోపాటు ఉద్యోగంలో పదోన్నతి, సత్వర వివాహం జరుగునని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, గజ్జల మురళీకృష్ణ, శంకర్‌లాల్ పాల్గొన్నారు.